ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
సోమవారం 8 డిసెంబరు 2025



దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం
- లారీని ఢీకొన్న కారు
- తండ్రి, కూతురు మృతి.. పలువురికి గాయాలు 7

వలస ఓటర్ల కోసం పట్నం బాట
- పోలింగ్ రోజు వచ్చేందుకు దారి ఖర్చులు అందజేత



మెదక్ చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు

మెదక్ చర్చిలో ఘనంగా క్యారెల్స్ డే

ఆసియాఖండంలోనే అతిపెద్దదైన మెదక్ చర్చిలో క్యారెల్స్ డే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్‌కు ముందు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈసారి డిసెంబరు మొదటి ఆదివారం ప్రారంభించారు.క్యాండిల్స్ వెలిగించడం ద్వారా దేవుడికి ప్రేమను తెలుపుతామని మత గురువుల పేర్కొన్నారు. క్రిస్మస్ సమీపిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసిపోయింది.

-మెదక్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)

భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను

సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

- ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
- అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు
- సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లివిగ్రహం ఏర్పాటు
- అతిథులు, పలు సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక వసతులు
- గంటకుపైగా ప్రాంగణాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి





గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పర్యవేక్షిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ఆదివారం పరిశీలించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న ప్రాంగణాన్ని స్వయంగా పర్యవేక్షించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాలు, వివిధ సదస్సులు, స్టాళ్ల కోసం ఏర్పాటు చేసిన హాళ్లను నిశితంగా పరిశీలించి దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి గంటపాటు అన్ని అంశాలను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జయవీర్‌రెడ్డి, ఫ్యూచర్‌సిటీ ప్రత్యేక అధికారి శశాంక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



హవేళీఘణపూర్‌లో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


హవేళీఘణపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోస్టల్‌బ్యాలెట్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించి ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన వారందరు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఓటర్లు తప్పనిసరిగా ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఏ గట్టునుండేనో..!

గుంభనంగా ఓటరు.. గుబులు రేపుతున్న ఓటరు మౌనం

- చేజారకుండా అభ్యర్థుల జాగ్రత్తలు
- ప్రత్యర్థుల ప్రచారంపై ఆరా
- గల్లీల్లో కదలికలపై నిఘా
- ఓటరు కటాక్షం కోసం పాట్లు
- అవసరమైనవన్నీ ఇంటికే..
- పంచాయతీ సమరంలో కొత్త పోకడ

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల వేడి జిల్లాలో తారాస్థాయికి చేరుకుంది. మొదటి రెండు విడతల నామినేషన్లు, గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగా.. మూడవ విడతకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 11, 14, 17 తేదీల్లో పోలింగ్ జరగనుంది. సమయం దగ్గరపడుతుండటంతో అభ్యర్థులు, వారి అనుచరులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికల ప్రచారం సరికొత్త పోకడలకు, ఉత్కంఠకు వేదికగా మారుతోంది.



మెదక్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రచారంలో అభ్యర్థులు ఎంత ఉత్సాహంగా ఉన్నా ఓటర్లు మాత్రం తమ నిర్ణయాన్ని బయటపెట్టకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ప్రచార బృందాలు తమను కలిసినప్పుడు తమ మనసులో ఏముందో రహస్యంగా ఉంచుతుండటం అభ్యర్థులకు గుబులు రేపుతోంది. దీంతో, గ్రామాల్లో ఓటు నిర్వహణ బాధ్యత తీసుకున్న నిర్వాహకులు ఉదయం నుంచే వీధుల్లో అనుచరులను మోహరిస్తున్నారు. ప్రత్యర్థి వర్గం ఎవరిని కలుస్తోంది, ఏ వీధిలోకి ప్రచారం వెళ్తోంది, ఎవరి వాహనం వస్తుందనే విషయాలపై నిఘా పెడుతున్నారు. అందుకు అనుగుణంగా ప్రచార వ్యూహాలకు పదునుపెడుతున్నారు.

మద్యం, భోజనాలు.. కట్టడి వ్యూహాలు

ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి, ముఖ్యంగా యువత ఇతర అభ్యర్థుల వైపు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పగటి పూట టెంట్లు వేసి సామూహిక భోజనాలు, బిర్యానీలు ఏర్పాటు చేయడం సర్వసాధారణంగా మారింది. రాత్రి సమయాల్లో అభ్యర్థుల అనుచరులు ఓటర్ల ఇళ్ల వద్దకే మద్యం బాటిళ్లను పంపిణీ చేస్తున్నారు. ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో లెక్క వేసుకుని మరీ బాటిళ్లను ఇస్తుండటం గమనార్హం. ఉదయం వేళల్లో కూలీ పనులు చేసుకునే పేదలు కల్లు సేవించే అలవాటును అభ్యర్థులు సొమ్ము చేసుకుంటున్నారు. కల్లు దుకాణం వద్దకు వెళ్లినప్పుడు తమ వర్గం ఓటర్లను ప్రత్యర్థులు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిని నివారించడానికి ఉదయాన్నే దుకాణంలోని కల్లు గుత్తగా కొనుగోలు చేసి, కులాలవారీగా ఓటర్ల ఇళ్ల ముంగిటికే

మిగతా 8వ పేజీలో..



ఐడీఏబొల్లారంలో నీటిట్యాంకు

తాగునీటికి భరోసా దక్కేనా

- జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీల విలీనం
- 20వేల లీటర్ల ఉచిత సరఫరా పథకంపై పేదల ఆశలు
- ఆదేశాల కోసం ఎదురుచూపులు

పటాన్‌చెరు డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో విలీనమైన మున్సిపాలిటీల్లో రక్షిత తాగునీటి పంపిణీ చేయాలని డిమాండ్‌లు మొదలయ్యాయి. పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం కల్పించేందుకు పురపాలికల విలీన ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఐడీఏబొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. ఐడీఏబొల్లారం పట్టణంలో పారిశ్రామికవాడల్లో పనిచేసే కార్మికులే ఎక్కువగా నివసిస్తారు. దశాబ్దాలుగా ఇక్కడే స్థిరపడటంతో ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను గతంలో క్రమబద్ధీకరించారు. ఇక్కడ ఉండే 70 శాతం మంది కార్మికులు 60గజాల ప్లాట్లలోనే ఇళ్లు నిర్మించుకోవడంతో ప్రభుత్వం ఉచితంగానే క్రమబద్ధీకరించింది. ఇటీవల జలమండలి అధికారులు 5వేల నివాసాలకు మిషన్‌భగీరథ పథకం కింద ఇంటింటికి నల్లాలను అమర్చారు. నెలకు రూ. 250 చొప్పున నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారు. తెల్లాపూర్, అమీన్‌పూర్ పురపాలికల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఏకమొత్తంగా నీటిని అందిస్తున్నారు. నెలవారీ 15వేల లీటర్లు వాడితే... వెయ్యి లీటర్లకు రూ. 15 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ పరిమితి

మిగతా 8వ పేజీలో..

గస్తీ ముమ్మరం

- అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా
- అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట
- అల్లర్లు సృష్టించేవారిపై పోలీసుల నజర్
- స్థానిక సమరం కోసం వెయ్యి మందితో బందోబస్తు



కర్ణాటక సరిహద్దులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసుశాఖ గస్తీ ముమ్మరం చేసింది. సంగారెడ్డి జిల్లాలో 613 గ్రామ పంచాయతీలకు 5,370 పోలింగ్ స్టేషన్లలో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల్లో ప్రభావితం చేసే మద్యం, డబ్బు అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది.

వెయ్యి మందితో బందోబస్తు

జిల్లాలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం సుమారు వెయ్యి మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. గ్రామాల్లో ఎలాంటటి ఘర్షణలు చోటు చేసుకోకుండా రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. పోలింగ్ రోజున ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక బెటాలియన్ బృందాలు కూడా జిల్లాకు రానున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

అక్రమ రవాణాకు చెక్

సంగారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు సరిహద్దులో ఉన్నాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంపిణీ చేయడానికి పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి జిల్లా పోలీసులు అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. జిల్లా సరిహద్దులోని మాడ్గి, హంసెల్లి, మోర్గిల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ప్రత్యేక పోలీసు బృందం ఆధ్వర్యంలో ఈ చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలింపును అడ్డుకుంటున్నారు. దీంతో గత నెల 27 నుంచి ఇప్పటి వరకు ఆయా చెక్‌పోస్టులలో 646 లీటర్ల మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ దాదాపు రూ. 4.3లక్షలు వుంటుంది. మొత్తం 77 కేసులు నమోదు చేశారు.

అల్లర్లు సృష్టించేవారిపై నజర్

గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిపై పోలీసులు నజర్ పెట్టారు. ఎన్నికలను ప్రభావితం చేసే హిస్టరీ షీటర్లను సత్ప్రవర్తన కోరుతూ జిల్లాలో గతంలో 912 వివిధ కేసులతో సంబంధం ఉన్న 1,080 మందిని బైండోవర్ చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు సృష్టించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

డబ్బు, బహుమతుల పంపిణీపై ఫోకస్

స్థానిక ఎన్నికలను ప్రభావంతం చేసే డబ్బు, మద్యం, ఇతర క్రీడా సామగ్రి పంపిణీపై కూడా పోలీసులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రూ. 50వేలకు మించి డబ్బు రవాణా చేస్తే సీజ్ చేస్తామని ముందుగానే పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రామాల్లో ఎక్కడైనా ఓటర్లను ప్రభావంతం చేసినట్లు తెలిసినా తమకు ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు.

అభ్యర్థులకు 'రియల్' సాయం

- శివారు గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారుల మాయాజాలం 7
- ఒకే గ్రామంలో రూ.25 కోట్లు ఖర్చుకు వెనకాడని అభ్యర్థులు

అక్రమంగా సంపాదిస్తే జప్తు చేసుకోవచ్చు

- బాండ్‌పేపర్‌పై రాసిచ్చిన సర్పంచ్ అభ్యర్థి 7

కార్మిక వ్యతిరేక చట్టాలను ఐక్యంగా ఎదుర్కొందాం

- కోటి మంది అసంఘటిత కార్మికులకు గుర్తింపు లేదు
- దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని కేరళ ప్రభుత్వం తేల్చింది
- సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో వక్తలు

7



మెదక్‌లో ర్యాలీ తీస్తున్న సీఐటీయూ శ్రేణులు

పంచాయతీ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

మెదక్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ మండల పరిధిలోని భోజిపల్లి టోల్‌ప్లాజా వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎఫ్ఎస్‌టీ బృందాలు చేపడుతున్న తనిఖీలను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం పరిశీలించారు. ఇప్పటివరకు సోదాలలో పట్టుబడిన లిక్కర్ నిల్వల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలు, ఎంసీసీ అమలు, వాహనాల పర్యవేక్షణ, అనుమానాస్పద రవాణా నివారణపై అధికారులు సక్రమంగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారో లేదోనని పరిశీలించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశాలను నివారించేందుకు నిఘా కొనసాగిస్తూ పకడ్బందీగా సోదాలు జరపాలని ఆదేశించారు. ప్రతీ వాహనాన్ని వీడియో సమక్షంలో పరిశీలించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు.



తనిఖీలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రణరంగం.. నర్సాపూర్

- ప్రధాన పార్టీల జిల్లా నేతల పంతం
- రసవత్తరంగా మూడో విడత పంచాయతీ సమరం
- ఎవరికి వారు పావులు.. పట్టుకోసం యత్నాలు
- 181 పంచాయతీలకు డిసెంబర్ 17న పోలింగ్



నర్సాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలు ఇప్పుడు రాజకీయ బలప్రదర్శన వేదికగా మారాయి. నర్సాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని మొత్తం 183 పంచాయతీలకు జరగనున్న ఈ పోలింగ్ ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో పాటు ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల జిల్లా అధ్యక్షులు ఈ నియోజకవర్గం వారే కావడంతో సత్తాను నిరూపించుకోవడానికి ఎవరికి వారు పావులు కదుపుతున్నారు. ఇప్పటి వరకు కేవలం రెండు చిన్న పంచాయతీలు మాత్రమే ఏకగ్రీవం కాగా.. మిగతా చోట్ల త్రిముఖ పోటీ తప్పదు.

అగ్ర నాయకుల పట్టు

మూడో విడతలో ఎన్నికలు జరగనున్న నర్సాపూర్, చిలిప్‌చెడ్, కౌడిపల్లి, కొల్చారం, మాసాయిపేట, శివ్వంపేట, వెల్దుర్తి మండలాలు నర్సాపూర్ నియోజకవర్గానికే చెందుతాయి. ఈ ప్రాంతం రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందడానికి ప్రధాన కారణం ఇక్కడి నుంచి కీలకమైన జిల్లా నేతలు ప్రాతినిధ్యం వహించడమే. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఈ నియోజకవర్గానికి చెందినవారే. తమ మద్దతుదారులను గెలిపించుకోవడం ద్వారా పార్టీలో తమ పట్టును, ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అనివార్యత ఉంది. అందుకే ఈ ఎన్నికలు కేవలం గ్రామ పాలకమండలిని ఎన్నుకునేవిగా కాకుండా ముగ్గురు నేతల శక్తి సామర్థ్యాలకు పరీక్షగా మారాయి.

ఏడు మండలాల్లో హోరాహోరీ

నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం తర్వాత గుర్తులు కేటాయించనున్నారు. అనంతరం గ్రామాల్లో ప్రచారం ఊపందుకోనుంది. ప్రధాన పార్టీలు వ్యూహాత్మకంగా ఆర్థికంగా బలంగా ఉన్నవారు, ప్రజల్లో పేరున్న బలమైన అభ్యర్థులను బరిలో దించుతున్నారు. ఈ ఏడు మండలాల్లోని మొత్తం 183 పంచాయతీలకు గాను కేవలం నర్సాపూర్ మండలంలోని రెండు చిన్న తండా పంచాయతీలు మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. మిగతా 181 పంచాయతీలలో పోటీ తీవ్రస్థాయిలో

మిగతా 8వ పేజీలో..

రెండు తలల దూడ జననం.. మృత్యువాత

తూప్రాన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో రెండు తలల దూడ జన్మించింది. పట్టణానికి చెందిన అర్కల కృష్ణ కు చెందిన గేదె శనివారం రాత్రి ప్రసవించింది. దూడకు రెండు తలలు ఉండడంతో కుటుంబీకులు, పశు వైద్యులు రెండు గంటలు శ్రమించి దూడను బయటకు లాగారు. అయితే కాసేపటికి దూడ మృత్యువాత పడడంతో పూడ్చిపెట్టారు.





కల్హేర్ మండలం దేవునిగుట్ట మల్లన్న స్వామి జాతరకు హాజరైన అశేష జనవాహిని

జనసంద్రమైన దేవుని గుట్ట

● వైభవంగా మల్లన్న స్వామి జాతర ● స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన జనం

కల్హేర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కల్హేర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామ శివారులోని దేవునిగుట్ట మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మార్గశిర మాసం రెండో ఆదివారం నిర్వహించే ఈ జాతర ఉత్సవాల్లో మల్లన్న స్వామి దర్శించుకోవడానికి అశేషంగా భక్తులు తరలివచ్చారు. ఉదయం దేవునిపల్లి, మాసాన్‌పల్లి గ్రామాలకు చెందిన గొల్ల, కుర్మ యాదవులు స్వామి వారికి సంప్రదాయంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గుట్ట చుట్టూ ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు అశేషంగా హాజరైన భక్తులతో గుట్ట ప్రాంతమంతా నిండిపోయింది. జాతర ఉత్సవాల్లో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన భక్తులతో పాటు సరిహద్దున ఉన్న కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో హాజరై మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కల్హేర్ ఎస్‌ఐ రవిగౌడ్ సిబ్బందితో కలిసి బందోబస్తు చర్యలు చేపట్టారు.



దేవుని గుట్టపై మల్లన్న స్వామి దర్శనం చేసుకోవడానికి బారులు తీరిన భక్తులు

ఆదివారం ఆలయాలు కిటకిట



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



దుర్గమ్మ తల్లికి హారతి ఇస్తున్న అర్చకుడు

కొమురవెల్లి/పాపన్నపేట/జగదేవ్‌పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు రోజు సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీంతో ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులు ఇబ్బందులు కలుకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి సన్నిధిలోని గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖమండపంలో భక్తులు పట్నాలు వేసి బోనాలు చెల్లించుకున్నారు అనంతరం స్వామిని దర్శించుకొని బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు గుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు, బోనాలు, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఏడుపాయల వనదుర్గామాత దర్శనానికి ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, జంట నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

● జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మ ఆలయంలో అమ్మవారికి రంగులతో అలంకరించిన బోనాలను నెత్తిపై ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో శివసత్తుల శిగాలతో ఊరేగింపుగా తీసుకుచ్చి సమర్పించారు. ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొండపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

అయోధ్యలో ప్రత్యేక పూజల్లో మాధవానందస్వామి

● పాల్గొన్న మెదక్ జిల్లా భక్తులు



అయోధ్యలో మాధవనందస్వామితో పాటు మెదక్ జిల్లా భక్తులు

నర్సాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం రాంపూర్ పీఠాధిపతి మాధవానందస్వామి ఆధ్వర్యంలో కాశీ, అయోధ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెల 28 నుంచి డిసెంబరు 4 వరకు కాశీలో శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞం, అలాగే అయోధ్యలో ఈ నెల 6, 7 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి మెదక్ జిల్లా నుంచి వందల సంఖ్యలో భక్తులు వెళ్లారు. ఇందులో నర్సాపూర్ నుంచి మాజీ జడ్పీటీసీ మాధవి జగదీష్, మాజీ ఎంపీపీ రమణరావు, మాజీ వార్డు సభ్యుడు నర్సింలు దంపతులతో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పెద్దశంకరంపేటలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న అధికారులు

పెద్దశంకరంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్పెషల్ టీం సిబ్బంది పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం పెద్దశంకరంపేట నుంచి టాటా వాహనంలో 5 కాటన్ల మద్యాన్ని తరలిస్తుండగా ప్రత్యేక సిబ్బంది పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు జుల్ఫీ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు జరిగే అన్ని గ్రామాల్లో స్పెషల్ టీంతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాకీర్ అలీ, ఏఎస్‌ఐ చంద్రమోహన్, చంద్రన్న, తదితరులు ఉన్నారు.

● గజ్వేల్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గజ్వేల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు గజ్వేల్ పట్టణ శివారులోని బయ్యారం చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టారు. బయ్యారం గ్రామానికి చెందిన పంగా ప్రశాంత్, వంటేర్పుల స్వామి బైక్‌పై మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.11454 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

మృతి చెందిన నవజాత శిశువు లభ్యం



ఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఆర్‌అండ్‌బీ డీఈఈ కార్యాలయం ఎదుట నవజాతశిశువు మృతదేహం శనివారం రాత్రి లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంగారెడ్డి పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని లభ్యమైన శిశువును సంగారెడ్డి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు శిశువు లభించిన ప్రాంతానికి ఆదివారం ఉదయం చేరుకొని విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు చుట్టు పక్కల అంగన్‌వాడీల కార్యకర్తల ద్వారా జిల్లా వ్యాప్తంగా విచారణ చేస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన అప్పుడే పుట్టిన పిల్లలను వద్దనుకుంటే సంగారెడ్డిలోని శిశుగృహకు అప్పగిస్తే పిల్లలు లేని కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత ఇవ్వనున్నట్టు తెలిపారు.

పోలీస్ వాహనాన్ని ఢీ కొట్టిన చేపల లారీ

● లారీ బోల్తా.. పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ పోలీస్‌చెక్ పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి ఆగి ఉన్న పోలీస్ వాహనాన్ని చేపల లారీ ఢీ కొట్టింది. ఆ సమయంలో పోలీస్ వాహనంలో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. గూడూరు నుంచి ఢిల్లీకి వెళ్తున్న చేపల లారీ హుస్నాబాద్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద నిలిపి ఉన్న పోలీస్ వాహనాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. దీంతో పోలీస్ వాహనం రోడ్డు కిందకు పొలాల్లోకి 200 మీటర్ల మేర దూసుకుపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాయపడిన హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. లారీని క్రేన్ సహాయం పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



బోల్తాపడిన లారీ, రోడ్డు కిందికి దూసుకెళ్లిన పోలీస్ వాహనం

అభ్యర్థులకు రియల్ సాయం


● గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారుల మాయాజాలం ● ఒకే గ్రామంలో కోట్ల ఖర్చుకు వెనకాడని అభ్యర్థులు



పటాన్‌చెరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులు రాజకీయాలను శాసిస్తున్నారు. అభ్యర్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు. బరిలో ఉండే ఇద్దరు అభ్యర్థులను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఇద్దరిలో ఒకరిని ఎంపిక చేసుకొని గెలిపించుకునే పనిలో ఉంటూ, ఒకవేళ ఓడిపోయినా డబ్బులు తీసుకున్న గెలిచిన మరో అభ్యర్థిని తనవాడిగా మార్చుకుంటున్నారు. పటాన్‌చెరు మండలం భానూరు, క్యాసారం, నందిగామ గ్రామాల్లో అభ్యర్థుల మధ్య హోరాహోరీగా ఎన్నికల ప్రచారాలు జరుగుతున్నాయి. నువ్వా నేనా అన్నట్టుగా ఇంటింటి ప్రచారాలు సాగుతున్నాయి. ఈ రెండు గ్రామాల్లో పూర్తిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరిలో ఉన్నారు. పేరొందిన ఓ రియల్ వ్యాపారికి చుట్టుపక్కల గ్రామాల్లో పెద్దఎత్తున ఖరీదైన భూములు ఇప్పించడం నిత్య ప్రక్రియగా మారింది. గ్రామస్థుల నుంచి భూములు లాక్కోవడంలో చాకచక్యత ప్రదర్శిస్తున్నందుకు పెద్ద మొత్తాల్లో నిత్యం కమిషన్ తీసుకోవడం అలవాటుగా మారింది. ప్రస్తుతం పోటీపడుతున్న అభ్యర్థులు ఇద్దరికీ నామినేషన్ వేసిన మరుక్షణం కోటి రూపాయల చొప్పున అందజేసినట్టు తెలిసింది. ఎన్నికకు రెండు రోజుల ముందు పెద్దఎత్తున నిధులు అందజేయడానికి సదరు వ్యాపారి సన్నాహాలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో ఒక అభ్యర్థికి ప్రత్యేకంగా పెద్దఎత్తున నిధులు సమకూర్చేందుకు వ్యాపారి సమాయత్తమైనట్లు తెలిసింది. అలా ఒక్క గ్రామంలో ఇద్దరు అభ్యర్థుల ఖర్చులు కలిపితే రూ.20 కోట్లు దాటే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒక్క మద్యానికే కోటి రూపాయలు వెచ్చిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తెల్లవారుజాము నుంచి ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకంగా భోజనాలు పెడుతున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను ప్రలోభానికి గురి చేయడానికి ఒక్కో ఓటరుకు ఒక్కో అభ్యర్థి రూ.30 వేల చొప్పున ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది.







వలస ఓటర్ల కోసం పట్నం బాట

● పోలింగ్‌కు రప్పించేందుకు రానుపోను ఖర్చులు అందజేత

ఝరాసంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులు తమ గ్రామాల నుంచి జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లతో సంప్రదింపులు జరిపి, వారిని రెండో విడత పోలింగ్ రోజు, డిసెంబర్ 14న, తిరిగి గ్రామాలకు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందు కోసం అవసరమైన బస్సు ఛార్జీలు, ఇతర ఖర్చులను భరించేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా, తమకే ఓటు వేసేలా వారి నుంచి మాట కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. ఎందుకంటే, ఈ పంచాయతీ ఎన్నికల్లో వలస ఓటర్లే కీలకం కానున్నారు. కొంతమంది అభ్యర్థులు వీరి కోసం పట్నంలోనే మకాం వేశారు. ఓటర్లకు ముందుగానే ఖర్చులు, ఛార్జీలను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు వచ్చిన గుర్తులను పదే పదే చెప్పి, తప్పక ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

2 జీపీలు, 69 వార్డులు ఏకగ్రీవం

ఝరాసంగం మండలంలో 33 గ్రామ పంచాయతీలు, 516 వార్డులు ఉండగా, చీలపల్లి, చీలపల్లితండా తో పాటు 69 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడత ఎన్నికలు 31 గ్రామ పంచాయతీలతో పాటు 447 వార్డు సభ్యులకు జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లతో పాటు ఇతర సామాగ్రి కూడా మండలానికి చేరుకున్నాయి.

మాజీ సర్పంచుల కోడళ్ల మధ్యే పోటీ



నారాయణఖేడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో ఇద్దరు మాజీ సర్పంచుల కోడళ్ల మధ్యే పోటీ నెలకొననుంది. నారాయణఖేడ్ డివిజన్‌లో నిజాంపేట అతిపెద్ద గ్రామం. నిజాంపేటలో 4259 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మాజీ సర్పంచులుగా పని చేసిన చీలపల్లి సాయిరెడ్డి కోడలు కావ్య, జాల బాలయ్య కోడలు జాలలక్ష్మి పోటీ చేస్తున్నారు. చీలపల్లి కావ్య మామ సాయిరెడ్డి గతంలో నిజాంపేట సర్పంచ్‌గా ఒకసారి, ఎంపీపీ ఉపాధ్యక్షులుగా ఇటీవలి వరకు పని చేశారు. జాల బాలయ్య రెండు సార్లు నిజాంపేట సర్పంచ్‌గా పని చేయడమే కాకుండా, ఆయన భార్య గంగమ్మ ఒకసారి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఇద్దరు మాజీ సర్పంచుల కోడళ్లే పోటీ చేయడం రసవత్తరంగా మారింది. విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.



గంగారాం తండా సర్పంచు ఏకగ్రీవం



నాగల్‌గిద్ద,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల పరిధిలోని గంగారాం తండా సర్పంచుగా రాథోడ్ రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ మద్దతు దారు అభ్యర్థి అయిన ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడున్న 8 వార్డులకూ ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలవడంతో అన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఇంకా అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

అక్రమంగా సంపాదిస్తే జప్తు చేసుకోవచ్చు

● బాండ్ పేపర్‌పై రాసిచ్చి మరీ సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మండలం తాడూరు గ్రామ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి బొడికె నర్సింహులు వినూత్న తరహా ఆలోచన చేశారు. తన పట్ల నమ్మకం కుదిరేలా నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై రాయించి గ్రామస్తులను ఆకర్షించే ప్రయత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది. తాను అక్రమంగా సంపాదించనని, తన కుటుంబానికి ప్రస్తుతం ఉన్న ఆస్తులకు మించి ఎంత సంపాదించినా వాటిని గ్రామ పంచాయతీ జప్తు చేసి ప్రజలకు పంచవచ్చని పేర్కొన్నారు. పనులు చేయడానికి ప్రజల వద్ద చేయిచాచబోనని, గ్రామ పంచాయతీ సొమ్ము దుర్వినియోగం చేయబోనని, తప్పుడు లెక్కలు చూపించకుండా సమగ్రాభివృద్ధికి పాటుపడతానని గ్రామస్థులకు తెలిపారు. తాను రాసి ఇచ్చిన బాండ్ పేపర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. ఇదిలా ఉండగా, గతంలో మాజీ ఎంపీపీగా వ్యవహరించిన బొడికె నర్సింహులు చాలా రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉండి వ్యవసాయం పనులు చేసుకుంటూ సాదాసీదా జీవనం సాగిస్తున్నాడు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా రిజర్వేషన్ అనుకూలించడంతో గ్రామ సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు. ప్రత్యర్థుల బలాన్ని తట్టుకుని ప్రజల ఆశీర్వాదం మూటగట్టుకునేందుకు బాండ్ పేపర్ రాసి ఇవ్వడంతో ఒక్కసారిగా తాడూరు గ్రామం హాట్‌టాపిక్‌గా మారింది.


भारतीय गैर न्यायिक
पचास रुपये | FIFTY RUPEES
रु.50 | Rs.50
INDIA NON JUDICIAL
తెలంగాణ तेलंगाना TELANGANA

తాడూరు సర్పంచు అభ్యరి బొడికె నర్సింహులు రాసి ఇచ్చిన బాండ్ పేపర్

పదవైతే వచ్చింది కానీ... విచారణే పరేషాన్..!

దుబ్బాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో బహిరంగంగా వేలం పాట పాడారనే కేసు నమోదు కావడం దేవుడెరుగు..? ఇప్పుడు ఏకగ్రీవం అయిన సర్పంచ్‌కు విచారణ తంటా మొదలైందనే చెప్పాలి. అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో బహిరంగంగా వేలం పాట చేపట్టారని 63 మందిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఊరంతా ఏకమై, గ్రామంలోని నీలం ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేసు పుణ్యమా అని, నయా పైసా లేకుండానే సర్పంచ్‌పై ఏకాభిప్రాయం కుదిరి, ఏకగ్రీవంగా సర్పంచ్ పదవి దక్కిందని అంతా భావించారు. ఐతే ఏకగ్రీవంపై మాత్రం పోలీసులు కూపీ లాగే ప్రయత్నం వదలడంలేదు. కొంత డబ్బులు చేతులు మారవచ్చనే అనుమానంతో విచారణ మాత్రం సీరియస్‌గానే సాగిస్తున్నట్టు తెలిసింది. పదవైతే వచ్చిందికానీ... విచారణే కొత్త సర్పంచ్‌కు పరేషాన్ తప్పదేమో..?

ఏకగ్రీవమైతే అయ్యాడు... ఇంటి కుదవకు తిరుగుతున్నాడు..!

● పదవి తెచ్చిన తంటా... బాకీ తప్పదంటా

దుబ్బాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీలో ఒక వ్యక్తి సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏదో సామాజిక సేవ చేశాడనీ కాదు సుమా..! ఈ ఊరిలోని ఒక దేవాలయంకు తన వంతుగా భారీ మొత్తమే అందిస్తానని హామీనిచ్చి, సర్పంచ్ పదవిని చేజిక్కించుకున్నారు. సర్పంచ్ పదవి దక్కిన మరుసటి రోజు నుంచీ అసలు తంటా మొదలైంది. తాను గొప్పగా పలికి, హామీనిచ్చిన మొత్తాన్ని నెరవేర్చేందుకు గ్రామస్థులు వెంటపడటం మొదలైంది. నయాపైసా చేతిలో లేని సదరు కొత్త సర్పంచ్‌గారు గత్యంతరం లేక తన ఇంటిని కుదువపెట్టేందుకు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ, ప్రైవేటు ఫైనాన్షియల్ సంస్థల చుట్టూ తిరగక తప్పడంలేదు. సుమారు పది లక్షలకు తన ఇంటిని కుదువపెట్టేందుకు రుణం కోసం తిరుగుతున్న ఆ సర్పంచ్‌గారిని చూసి, అంతా జాలిపడుతున్నారు. ఏది ఏమైనా పదవి తెచ్చిన తంటా... బాకీ తప్పదు ఇంటా..! అని గుసగుసలు మొదలైనాయి.

సర్పంచ్‌గా కార్వాన్ ఎమ్మెల్యే సతీమణి ఏకగ్రీవం



వెల్దుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామ సర్పంచ్‌గా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సతీమణి నజ్మా సుల్తానా ఎన్నికయ్యారు. బస్వాపూర్ పంచాయతీ సర్పంచ్‌కు నజ్మా సుల్తానాతో పాటు కాసాల ఇందిర నామినేషన్ వేశారు. కాగా, ఆదివారం కాసాల ఇందిర తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు సమర్పించారు. దీంతో బస్వాపూర్ సర్పంచ్ స్థానం ఏకగ్రీవం కానుంది. అలాగే, పంచాయతీ పరిధిలోని 8 వార్డులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో పాలకవర్గం పూర్తి స్థాయిలో ఏకగ్రీవం అయింది. పాలకవర్గం ఎన్నికను సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

పోతిరెడ్డిపల్లి గ్రామపెద్దలకు బైండోవర్ నోటీసులు



పోతిరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థితో పాటు గ్రామ పెద్దలకు కౌన్సెలింగ్ చేస్తున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం

చేర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు పెద్దమనుషుల పట్ల పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఓ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు అతడు ఇచ్చిన హామీ మేరకు భూమిని పలువురు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయడానికి యత్నించగా రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్న విషయం విదితమే. కాగా, రోజురోజుకూ పోతిరెడ్డిపల్లి గ్రామ వ్యవహారం ముదిరిపోతుండటంతో పోలీసులు ఆదివారం ఆయా గ్రామ పెద్దలను స్టేషన్‌కు పిలిపించారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందం వారికి కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు బైండోవర్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఉన్నారు. అంతకుముందు ఏసీపీ సదానందం మండలంలోని దానంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్యాస్ లీకేజీ.. నిత్యావసర సరుకులు దగ్ధం



బెజ్జంకి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకేజీతో ప్రమాదవశాత్తు మంటలంటుకుని నిత్యావసర సరుకులు దగ్ధమైన సంఘటన బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ముత్తన్నపేటకు చెందిన కనగండ్ల పోచవ్వ, ఆమె కుమారుడు గోపి కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలో ఓ చిన్న ఇంట్లో ఉంటున్నారు. ఇంట్లో రాత్రి వంట చేసుకునేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించగా, గ్యాస్ లీకేజీతో మంటలు స్టవ్ వద్ద అంటుకున్నాయి. భయంతో పోచవ్వ, గోపి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించి ఇంట్లోని నిత్యావసర సరుకులు, దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను ఐక్యంగా ఎదుర్కొందాం

- కోటి మంది అసంఘటిత కార్మికులకు గుర్తింపు లేదు
- దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని కేరళ ప్రభుత్వం తేల్చింది
- సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో వక్తలు



ప్రసంగిస్తున్న సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

మెదక్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలతో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు కనుమరుగవుతాయని, అందుకనే ఐక్య పోరాటాల ద్వారా లేబర్ కోడ్ చట్టాలను ఎదుర్కొందామని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కామ్రేడ్ హేమలత పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్‌లోని చిల్డ్రన్స్ పార్క్ ప్రాంగణంలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను అట్టహాసంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సభలకు తొలిరోజు ఆదివారం హాజరై ఉద్విగ్నభరిత ప్రసంగం చేశారు. లేబర్ కోడ్ వల్ల కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ, గత పది సంవత్సరాల క్రితం కార్మికులకు అందిన వేతనాలే ఇప్పటికీ వర్తిస్తున్నాయని వాపోయారు. 168 రూపాయల నెలసరి వేతనంగా కేంద్రం ప్రకటించడం దోపిడీ కాదా? అని ప్రశ్నించారు. యూనియన్ పెట్టుకోవడానికి కూడా కార్మికులకు అనుమతి ఉండని చట్టాలను ప్రవేశపెడుతుండడం అమానుషమన్నారు. దేశంలో అంబానీ సంపద 2014లో 10వేల కోట్లు కాగా, ప్రస్తుతం రూ.10 లక్షల కోట్లకు పడగలెత్తారని వివరించారు. రాష్ట్ర నాయకులు వీరయ్య మాట్లాడుతూ విదేశీ కార్మికులు మాత్రమే తమ వేతనాలు పెంచమని యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తారని, కానీ భారతీయ శ్రామికులు మాత్రం డబ్బు ఆశపడని వ్యక్తిత్వం కలవారని కొత్త లేబర్ పాలసీలో పొందుపరచడంలో ఉద్దేశాన్ని వివరించారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి సొంత ఇళ్లు లేవని, 2021 కల్లా దేశప్రజలందరికీ శాశ్వత ఇళ్లు కట్టిస్తామని ప్రధాని మోదీ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రాష్ట్ర నాయకులు చుక్క రాములు మాట్లాడుతూ, కామ్రేడ్ కేవల్ కిషన్ పోరాటాల స్ఫూర్తితో సీఐటీయూ కార్మికోద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు. సమావేశంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి మల్లేశం, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు విచ్చేశారు.



సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర నాయకులు చుక్క రాములు

ఎరుపెక్కిన మెదక్ పట్టణం

సీఐటీయూ రాష్ట్ర మహాసభల సందర్భంగా మెదక్ పట్టణం కమ్యూనిస్టు కార్యకర్తలతో ఎరుపుమయమైంది. ఎర్ర జెండాలు చేతబూని విప్లవ గేయాలు ఆలపిస్తూ, డప్పుల దరువుకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ పట్టణ వీధుల గుండా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు కమాన్ నుంచి గోల్కొండ వీధి, పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, రాందాస్ చౌరస్తాల మీదుగా చిల్డ్రన్స్ పార్క్ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు.

దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

- లారీని ఢీకొన్న కారు
- తండ్రి, కూతురు మృతి.. పలువురికి గాయాలు

శ్రీశైలం, సుదీక్ష (ఫైల్)

పటాన్‌చెరు డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి దైవదర్శనానికి వెళ్తుండగా కారు లారీని ఢీకొన్న ఘటనలో తండ్రి, కూతురు మృతిచెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరికి చెందిన శ్రీశైలం (40), భార్య లక్ష్మీ, కుమార్తె సుదీక్ష (8), శ్రీశైలం స్నేహితులు తిరుపతి, జ్యోతిలక్ష్మి, శశిక, దువికతో కలిసి కారులో తిరుపతికి శనివారం అర్ధరాత్రి ప్రయాణమయ్యారు. మేడ్చల్ వద్ద అవుటర్ పైకి ఎక్కి ప్రయాణిస్తుండగా తెల్లాపూర్ పురపాలిక పరిధి పాటి గ్రామ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీ పక్క లైన్ నుంచి వీరి కారు వెళ్తున్న లైన్‌లోకి వచ్చింది. అప్పటికే వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుదీక్ష అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీశైలంను ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. లారీలో ఉన్న మిగతా వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైటెక్‌సిటీలోని యశోదా ఆసుపత్రికి తరలించారు. శ్రీశైలం తమ్ముడు శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు



పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సామాగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు

పంచాయతీ ఎన్నికల సామగ్రి సిద్ధం

వెల్దుర్తి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల అధికారిణి ఉమాదేవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ కేంద్రాలలో అవసరం ఉన్న సామాగ్రిని సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు అతిథి అధ్యాపకుల ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల, కెమిస్ట్రీ విభాగాలలో బోధించుటకు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8న తారా కళాశాలలో ఉదయం 10 గంటల వరకు సంప్రదించాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌సెట్, రెండు పాస్ ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

● నగలు, నగదు అపహరణ


నర్సాపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో పట్టపగలు దొంగలుపడ్డారు. దండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి నగలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆదివారం రాత్రి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ పట్టణంలోని వినాయక్‌నగర్‌లో గూనగంటి మొగులయ్య, గూనగంటి రమేష్ అన్నదమ్ములు నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం ఇద్దరు అన్నదమ్ములు పనిమీద శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్లకు వెల్లగా వారిద్దరి భార్యలు పట్టణంలోని టైలర్‌షాపనుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి మహిళలు ఇంటికి వచ్చి చూడగా రెండు ఇళ్లకు తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటంతో వారి భర్తలైన రమేష్, మొగులయ్యలకు సమాచారమిచ్చారు. వారు సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకుని చూడగా రమేష్ ఇంట్లో రూ.10వేలు, పది తులాల వెండినగలు, అరతులం బంగారు ఉంగరం, అదే విధంగా మొగులయ్య ఇంట్లో బంగారు చెవి కమ్మలు, చిన్నపిల్లల బంగారు చెవిరింగులు, బంగారు ముక్కుపుడక, పదితులాల వెండి బిల్లలు, వెండిగొలుసు, రూ.40వేల నగదు తస్కరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

18, 23న సదరం క్యాంపులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 18, 23 తేదీల్లో సదరం క్యాంపులు(యుడీఐడీ) నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వారు, రెన్యూవల్ కోసం మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని హాజరుకావాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు ఫోన్ కాల్ లేదా మెసేజ్ సందేశం వచ్చినవారే క్యాంపునకు హాజరుకావాలని పేర్కొన్నారు. క్యాంపుకు వచ్చేవారు స్లాట్ పేపర్ ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్ ఫొటో, సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఫారూక్‌హుస్సేన్

నిజాంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఫయోసిల్ శస్త్ర చికిత్స చేయించుకున్న సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అమర్‌సేనారెడ్డిని మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ ఆదివారం సాయంత్రం తన స్వగృహమైన నార్లాపూర్ గ్రామంలో పరామర్శించారు. ఫయోసిల్‌తో బాధపడుతున్న ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పరామర్శించి, ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు.

ప్రతాప్‌కు మహాలింగస్వామి పరామర్శ

నారాయణఖేడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఖేడ్ మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన ప్రతాప్‌ను ఆదివారం కర్ణాటకలోని బీదర్ జిల్లా బాల్కి హీరేమఠానికి చెందిన మహాలింగస్వామి పరామర్శించారు. మహాత్మ బసవేశ్వరుడి ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలన్నారు. నెల క్రితం గణగాపూర్‌లోని దత్తాత్రేయస్వామి దర్శనం చేసుకొని వస్తుండగా బీదర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా.. తీవ్రగాయాలతో ప్రతాప్ ఒక్కరే బతికారు. హైదరాబాద్ నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

బీజేపీలోకి బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్, నాయకులు

చిలప్‌చెడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ అనంతరామగౌడ్ ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు కిష్టాగౌడ్, మల్లేశ్ గౌడ్, చంద్రాగౌడ్, కుసంగి పాండు, కురిగల్ల మధు, అంబదాస్ రమేష్‌గౌడ్, వెంకటేశం గౌడ్, కుసంగి రమేష్, శివశంకర్‌గౌడ్, అంజనేయులుగౌడ్, సాయికుమార్, సిద్దాగౌడ్ తదితరులు బీజేపీలో చేరారు.

మొదటి రోజు 11 మంది ఉపసంహరణ

శివ్వంపేట , డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలంలోని 37 పంచాయతీలు 312 వార్డుమెంబర్లకు జరిగే ఎన్నికలకుగాను 150 మంది సర్పంచ్ అభ్యర్థులు, 755 వార్డు మెంబర్లకు నామినేషన్ దాఖలు చేయగా ఆదివారం ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు, ఆరుగురు వార్డుసభ్యులు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారన్నారు. 9వ తేదీ 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

మోడల్ కోడ్‌పై అవగాహన

నంగునూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలని ఎంపీడీవో మహబూబ్ అలీ పేర్కొన్నారు. ఆదివారం నంగునూరు రైతు వేదికలో సర్పంచ్ వార్డు స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులకు మోడల్ కోడ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పి.మాధవి, రాజగోపాల్ పేట ఎస్ఐ టి.వివేక్ , మండల విద్యాశాఖ అధికారి దేశిరెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలన్నారు.

రాజ్యాంగంతోనే మనకు స్వేచ్ఛ

మర్కుక్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్‌రాజు పందరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌హాల్‌లో నిర్వహించిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ జాతీయ రాజ్యాంగ దినోత్సవ ముగింపు ఉత్సవాలకు ఆహ్వానించారు. డిసెంబరు 6న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి సౌర్యపల్లి నంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- గత పాలకులు అభివృద్ధిని విస్మరించారు
- కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



వెల్దుర్తి : కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజిరెడ్డి

పాపన్నపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పాపన్నపేట మండలం ఎల్లాపూర్, పొడిచన్‌పల్లితండా, శేరిపల్లి, కొడుపాక, నాగసన్‌పల్లి, గాజులగూడెం, ఆర్కెల, బాచారం, నార్సింగ్ తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయించామని తెలిపారు. గత పాలకులు మెదక్ నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలు ప్రవేశ పెట్టామన్నారు. ఇల్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని తెలిపారు. మహిళకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గోవిందనాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిని గెలిపించాలి

వెల్దుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గుత్తి కిషన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కోరారు. ఆదివారం ఉప్పులింగాపూర్, ఉప్పులింగాపూర్‌తండాలో గుత్తి కిషన్‌కు మద్దతుగా రాజిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పలువురు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ప్రజల్లో ఆదరణ



కాంగ్రెస్‌లో చేరిన వారితో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగాపూర్ సర్పంచ్ పదవికి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న రుక్మిణీకి మద్దతుగా గ్రామానికి చెందిన దాదాపు 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం ఖేడ్‌లో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్, వార్డు పదవులకు పోటీచేస్తున్న వారి గెలుపునకు కృషి చేస్తామని చేరినవారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, స్థానిక నాయకులు సుధాకర్‌రెడ్డి, బక్కప్ప, హన్మంతు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచులకు సన్మానం

నారాయణఖేడ్ మండల పరిధిలోని ఖాంజీపూర్ తండా సర్పంచ్‌గా భాస్కర్, సిర్గాపూర్ మండలం గైర్హాన్‌తండా సర్పంచ్‌గా వడిత్య మోహన్‌తో పాటు ఆ పంచాయతీకి సంబంధించిన ఆరు వార్డుల్లో ఒక్కొక్క నామినేషన్లు దాఖలు కావడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్మానించారు.

మంత్రిని కలిసిన సెట్విన్ చైర్మన్



హుగ్గెల్లి చౌరస్తాలో మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన దృశ్యం

జహీరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి చౌరస్తాలో ఆదివారం మంత్రి అజారుద్దీన్‌ను సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళ్తున్న క్రమంలో మంత్రిని కలిశారు. స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని మంత్రి వారికి తెలియజేశారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ



పుల్‌కల్ : వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పుల్‌కల్/మాసాయిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ నెల 14న రెండోవిడత పంచాయతీ ఎన్నికలు జరుగనుండటంతో చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి టోల్ ప్లాజా వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి గుండా ప్రయాణించే కార్లు, జీపులు, ఇతరత్రా వాహనాలను ఆపి తనిఖీ చేస్తున్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు తనిఖీలు చేపట్టనున్నారు. అలాగే మాసాయిపేట-చేగుంట రహదారి, బొమ్మారం స్టేషన్, మాసాయిపేట, తిమ్మాయపల్లి రహదారులలో 44వ జాతీయ రహదారిపై పోలీసు, రెవెన్యూ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

గండి చెరువు అలుగు ఎత్తు సమస్యను పరిష్కరించాలి

- ఎంపీకి కాజీపల్లి గ్రామస్థులు వినతి



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన కాజీపల్లి గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

జిన్నారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కాజీపల్లి గండిచెరువు అలుగు ఎత్తు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఆదివారం ఎంపీ రఘునందన్‌రావును మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఆకుల భార్గవ, నాయకులు నవీన్ తదితరులు కలిశారు. కాజీపల్లి పరిధిలోని గండిచెరువు అలుగును అధికారులు ఎత్తు పెంచటం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి వ్యవసాయ భూములు నీట మునుగుతున్నాయన్నారు. చెరువు నీటిలో పరిశ్రమల వ్యర్థ జలాలు చేరి దుర్గంధం వస్తుందని ఎంపీకి తెలియజేశారు. అకారణంగా పెంచిన చెరువు అలుగు ఎత్తును తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం కాజీపల్లిని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీఇచ్చారని తెలిపారు.

ఎన్నికల నియమాలు తప్పనిసరి : ఎంపీడీవో



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో చిన్నారెడ్డి

చేగుంట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో స్టేజీ-2 ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చేగుంట మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో జరిగే సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, గ్రామాల స్టేజీ-2 ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సామూహికంగా భగవద్గీత పారాయణం



పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట పట్టణ శివారులోని ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో ఆదివారం భక్తులు భగవద్గీత 18 అధ్యాయాలు సామూహికంగా పారాయణం చేశారు. భగవద్గీతతో పాటు విష్ణు సహస్ర నామాల పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ



అయ్యప్ప స్వామికి పడి ముట్టిస్తున్న గురుస్వామి అల్లం మహేందర్

మెదక్ అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం తహసీల్దార్, గురుస్వామి అల్లం మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో గురుస్వామి హరిదాస్, వైద్యరాజు పర్యవేక్షణలో అయ్యప్పస్వామి మహాపడి పూజ జరిగింది. ముందుగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి పూజ నిర్వహించారు. మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలను నిర్వహించారు. మెట్లను వివిధ రకాలు పూలతో అలంకరించారు. అనంతరం పడిని గురుస్వామి వెలిగించారు. మహాపడి పూజకు అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని భజన, భక్తిగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ చెత్త రిక్షాలు

- అధికారుల నిర్లక్ష్యమే కారణం



మరమ్మతులు చేయకపోవడంతో మూలనపడ్డ చెత్త రిక్షాలు

శివ్వంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్‌లో భాగంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు చెత్త రిక్షాలను కొనుగోలు చేసింది. కాగా నాలుగేళ్లలోనే ట్రాక్టర్లు సైతం కొనుగోలు చేయడంతో చెత్త రిక్షాలు మూలనపడ్డాయి. మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్ల గ్రామపంచాయతీ ఎదుట మూడు చెత్త రిక్షాలు మరమ్మతుకు నోచుకోక మూలపడి ఉన్నాయి. అధికారులు స్పందించి రిక్షాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టా ఇచ్చారు.. భూమి చూపడం మరిచారు



పట్టాపాసు పుస్తకాలు, వినతిపత్రాలు చూపుతున్న షేక్ మహబూబ్

నారాయణఖేడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భూమి లేని తనకు 25 ఏళ్ల క్రితం సిర్గాపూర్ శివారులో 2 ఎకరాల భూమిని పంపిణీ చేసి.. అందుకు సంబంధించిన పట్టాపాసు పుస్తకం అందజేసినా ఇప్పటికీ భూమిని చూపలేదని సిర్గాపూర్‌కు చెందిన అమీనాబీషేక్ మహబూబ్ వాపోయారు. ఆదివారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ అప్పట్లో పట్టా పాసు పుస్తకం ఇవ్వగా ధరణి అందుబాటులోకి వచ్చాక కొత్త పట్టాపాసు పుస్తకం సైతం ఇచ్చారన్నారు. తనకు కేటాయించిన భూమిని చూపాలంటూ 25 ఏళ్లల్లో అనేకమార్లు, స్థానిక, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 18 ఎకరాల్లో సర్వే నిర్వహించి మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గుర్తించినా హద్దులు చూపి అప్పగించడం లేదన్నారు. పట్టాపాసు పుస్తకాలు, ఇప్పటివరకు అందజేసిన వినతి పత్రాల ప్రతులను రిజిష్టర్ పోస్టు ద్వారా ఖేడ్ సబ్ కలెక్టర్, కలెక్టర్‌కు పంపినట్లు వివరించారు. నెలరోజుల్లో తనకు న్యాయం చేయకపోతే సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు.

రణరంగం.. నర్సాపూర్

(5వ పేజీ తరువాయి)

ఉండనుంది. మండలాల వారీగా నర్సాపూర్‌లో 35, చిలప్‌చెడ్‌లో 19, కౌడిపల్లిలో 35, కొల్చారంలో 21, మాసాయిపేటలో 13, శివ్వంపేటలో 37, వెల్దుర్తిలో 23 పంచాయతీలు, మొత్తం 1528 వార్డులకు పోలింగ్ జరగనుంది.

సఖ్యత కొరవడిన ప్రతిపక్షం

బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి అంతా తానై వ్యవహరిస్తూ క్యాడర్‌ను ఏకతాటిపై నడిపిస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలకు స్థానం లేదని నిరూపించేందుకు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

మరోవైపు, కాంగ్రెస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ వారి సొంత పార్టీల స్థానిక ముఖ్య నాయకులతో సరైన సమన్వయం, సఖ్యత కొరవడడంతో సమస్యలు తప్పడం లేదు. ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తుండటంతో క్యాడర్ గందరగోళానికి గురవుతున్నారనే ప్రచారం సాగుతోంది. అంతర్గత సమన్వయ లోపం గెలుపు అవకాశాలపై ప్రభావం చూపవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ఈ ముగ్గురు నేతలు తమ సొంత నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికలలో ఏ మేర సత్తా చాటుతారో ఆసక్తిగా మారింది.

ఏ గట్టునుండేనో..!

(5వ పేజీ తరువాయి)

సరఫరా చేసే పనిలో పడ్డారు. దీని ద్వారా ఓటరు గట్టు దాటకుండా కట్టడి చేయాలని ప్రయత్నిస్తున్నారు.

ఓటర్ల సేఫ్ గేమ్

రెండు బలమైన వర్గాల మధ్య పోటీ తీవ్రమవుతున్న కొద్దీ ఓటర్లపై ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఒక వర్గం పిలిస్తే వెళితే, మరో వర్గం వారు ఏమనుకుంటారోనని భయం. రెండు వర్గాలనూ కలవకపోతే ఆగ్రహానికి గురవుతారేమోనన్న సందేహంతో ఓటర్లు సేఫ్ గేమ్ ఆడుతున్నారు. గ్రామాల్లో పలుకుబడి కలిగిన పెద్దలు, కుల, మహిళా సంఘాలు, వాణిజ్య సంఘాల ప్రతినిధులతో అభ్యర్థులు సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరు వచ్చినా నవ్వుతూ ఆహ్వానిస్తున్న ఓటర్లు తమ మనసులో ఏముందో మాత్రం బయటపెట్టడం లేదు. ఈ మౌనం అభ్యర్థులను కలవరపెడుతున్నది.

ప్రచారంలో కొత్త ధోరణి

తెలంగాణ ఉద్యమంలో ప్రధాన ప్రచారాస్త్రంగా నిలిచిన బతుకమ్మ ఆటా, పాటలు ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లోనూ సందడి సృష్టిస్తున్నాయి. అభ్యర్థులు భారీ సంఖ్యలో మహిళలను సమీకరించి గ్రామ కూడళ్లలో బతుకమ్మ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మెదక్ మండలం మాచవరం గ్రామంలో ఇలాంటి ప్రచారాన్ని నిర్వహించడం కనిపించింది. కరపత్రాలకు బదులుగా రియల్ ఎస్టేట్ బ్రోచర్ల మాదిరిగా ముద్రించిన ప్రకటనల్లో తాము గతంలో చేసిన సేవలను ఏకరువు పెడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మద్యం, ధన ప్రభావం పెరుగుతుండటంతో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి భరోసా దక్కేనా

(5వ పేజీ తరువాయి)

దాటితే రూ.50 వసూలు చేస్తున్నారు. 73 నివాసాల సముదాయాల కమ్యూనిటీకి ముందస్తుగా రూ.70లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.


20వేల లీటర్ల వరకు ఉచితంపై ఆశలు

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో నెలవారీ 20 వేల లీటర్ల లోపు నీటిని వినియోగిస్తున్న వారికి పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. ఈ పథకాన్ని ఇటీవల విలీనమైన పురపాలికల్లోనూ అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే మూడు పురపాలికలకు చెందిన ప్రతినిధుల బృందం ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆదేశాలు రావాల్సి ఉందని జలమండలి ఐడీఏబొల్లారం ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 నుంచి 10 గంటల వరకు సామూహిక అభిషేకాలు చేశారు. ఆరుద్ర నక్షత్రం రోజు స్వామివారికి అభిషేకం చేయడం చాలా ప్రశస్త్యమని చెబుతారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మఠం శివకాంత్ స్వామి పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

ఉచిత హెల్త్ క్యాంపునకు స్పందన



సంగారెడ్డిలో వైద్య సేవలందిస్తున్న డా.ధనలక్ష్మి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని శంకర్ మెడికల్ జనరల్ స్టోర్స్(ప్రభుత్వ ఆస్పత్రి సమీపం) వద్ద కేకే రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ హెల్త్ క్యాంపునకు స్పందన లభించింది. ప్రముఖ వైద్యులు డా.ధనలక్ష్మీ సమక్షంలో ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వచ్చిన ప్రజలకు వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు వందమంది వరకు ప్రజలు వైద్య సేవలు పొందినట్టు నిర్వాహకులు తెలిపారు.

జోగిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే నివాళులు

పుల్‌కల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ దివంగత మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి జోగిరెడ్డి భౌతికకాయానికి అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జోగిరెడ్డి శనివారం మృతిచెందారు. మృతదేహానికి స్వగ్రామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, రాంరెడ్డి, శివకుమార్, పల్నాటి ప్రభులింగంగౌడ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి

కల్హేర్/సిర్గాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.రాజశేఖర్(46) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా కామెర్ల వ్యాధితో అనారోగ్యం పాలైన రాజశేఖర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఆయన మరణం పట్ల సిర్గాపూర్ ఎంపీడీవో శారద, ఎంపీఈవో బ్రహ్మం, సిర్గాపూర్ మండల గ్రామపంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలియజేశారు. రాజశేఖర్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం మెగుడంపల్లి మండల పరిధిలోని ధనసిరిలో సోమవారం జరుగనున్నట్లు వారు తెలిపారు.